కథ

# ఆ మూడు రోజులు

వంశీకృష్ణ



ఎవరో కక్షనంతా మనసులో పెట్టుకుని, చిరునవ్వులు చిందిస్తూ పక్కన కూర్చుని కన్పించీ కన్పించకుండా సన్నటి సూదులతో పొట్టనంతా గుచ్చుతున్నట్లుగా మంటలు మండిస్తున్న బాధ. గుండెలో ఉండ చుట్టుకున్న బాధంతా గొంతులో నుండి బయటకు రాలేక, లోపల ఉండలేక... ఆరడి పెడుతున్నట్లుగా... ఒక అమూర్త వేదనంతా పొట్టను కూకటి వేళ్ళతో పెకిలిస్తున్నట్లుగా అన్పించేసరికి భారంగా కళ్ళు తెరిచింది గాయత్రి. పైన ఫ్యాను తిరుగుతున్నా... మొహమంతా చెమట అల్లుకుంది. సన్నగా నొప్పిస్తున్న పొట్టను రెండు చేతులతో అదుముకుంటూ లేచి కూర్చుంది గాయత్రి.

చేతికి అందేంత దూరంలో పడుకుని ఉంది శ్యామల. శ్యామల మీద కాళ్ళేసి పడుకున్నాడు చిన్నతమ్ముడు. శ్యామల తలగడ ప్రక్కగా డోర్ విరిగిపోయిన టేప్‌రికార్డర్. దాని ముంగిట పాత పాటల కాపు హేమంతుడి రేఖా చిత్రంతో విరిగిపోయిన క్యాసెట్ డోమ్. గోడ మీద నుండి జారనా... వద్దా... అన్నట్లుగా అంటిపెట్టుకున్న బల్లి పిల్ల. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ కోసం మనిషి పడే తపన లాంటి తపన అనుభవిస్తున్న పురుగు ఒకటి. గోడ పక్కగా చైను తెగిపోయిన చిన్న సైకిలు. మంచం క్రిందకు తోసివేసిన సాహిత్య పుస్తకాలు, దినపత్రికలు... సవాలక్ష అనవసర వస్తుసామాగ్రి. ఆరూ ఇంటూ మూడు వైశాల్యం వున్న ఆ చిన్నగది...

అంత బాధలోనూ చిన్నగా నిట్టూర్చింది గాయత్రి గదిని చూస్తూ. పొట్టలో నొప్పి ఎక్కువయ్యేసరికి... పక్కనే ఉన్న చెంబులో నీళ్ళున్నాయేమోనని చూసింది. చెంబు ఖాళీగా కన్పించింది. ఇంక ఆగలేక అక్కను పిల్చింది.

''శ్యామూ... ఏయ్ శ్యామలా...!''

రాత్రి పన్నెండు గంటలదాకా పనిచేసీ... పనిచేసీ పడుకున్న శ్యామల గాయత్రి మాటలకు మత్తుగా పక్కకు వత్తిగిల్లింది తప్పిస్తే కళ్ళు విప్పే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

''శ్యామూ... ఏయ్ శ్యామలా...?'' ఈసారి ఇంకాస్త గట్టిగా పిలిచింది గాయత్రి.

''ఊ'' అంటూ బద్ధకంగా మూలిగింది శ్యామల. తప్పిస్తే లేవలేదు.

దీన్దంతా మొద్దునిద్ర. కుంభకర్ణుడికి చెల్లెలిగానో లేకపోతే ఊర్మిళకి అక్కగానో పుట్టివుంటుంది గత జన్మలో. ఖర్మకాలి ఇప్పుడు ఈ జన్మలో ఈ ఇంట పుట్టింది అనుకుంది గాయత్రి.

''ఏయ్... శ్యామలా...'' ఈసారి మరింత గట్టిగా... అరిచినట్లుగా పిలిచింది గాయత్రి.

ఆ పిలుపుకి ఉలిక్కిపడి లేచింది శ్యామల. ఒక్కక్షణంపాటు శ్యామలకు ఏం అర్థం కాలేదు. తన మీదకు వంగి మరీ పిలుస్తున్న గాయత్రి మొహం... గ్రహణం పడుతున్న చంద్రుడిలాగా అన్పించింది శ్యామలకి.

''ఏంటే...'' కొంచెం విసుగ్గా అడిగింది శ్యామల.

''కడుపులో... నొప్పి.... బరల్‌గన్ లాంటిది ఉందా ఇంట్లో'' పొట్టను లోపలకు అదుముకుంటూ బలహీనంగా అడిగింది గాయత్రి.

''రాత్రే తెచ్చుకుని ప్రక్కన పెట్టుకోమని చెప్పాను కదా... తెచ్చుకోలేదా... కడుపులో నొప్పి వస్తుందని తెలిసినప్పుడు ముందే జాగ్రత్త పడాలి. ఇప్పుడు ఇంట్లో ఉందో.... లేదో...?'' అసహనాన్ని దాచుకోవడానికి ఏ మాత్రం ప్రయత్నం చెయ్యకుండా లేచింది శ్యామల. అప్పుడప్పుడే పడుతున్న నిద్రలోకి సుఖంగా జారగబోతున్న తనని నిర్దాక్షిణ్యంగా బయటకు లాక్కుని వచ్చిన గాయత్రిపై కోపం పెరిగిపోయింది శ్యామలకు. బలవంతంగా కళ్ళు విప్పడం వలన ఆమె కళ్ళన్నీ కమ్మరి కొలిమిలా భగ భగా మండుతున్నాయి.

శ్యామల విసుగుకీ, అసహనానికీ, గాయత్రికీ కోపం వచ్చింది. ''ముందే తెచ్చుకోవాలన్న జ్ఞానం నాకూ ఉంది. కానీ నువ్వెందుకులే అక్కా... నేను తెస్తాను అన్న రవిగాడు మర్చిపోయాడు'' అంది గాయత్రి. అది సంజాయిషీనో... వివరణో మరి అర్థంకాలేదు. శ్యామల లేచి లైటు వేసింది.

నిజానికి ఆ గదిలో పెట్టిన వస్తువేదీ పెట్టిన చోటున ఉండదు. ఇంట్లో ఆరుగురు సభ్యులు ఉంటే ఆరుగురు ఒక్కొక్కరూ ఒక్కొక్క వస్తువుకి ఒక్కో స్థానం నిర్ణయిస్తారు. స్థానభ్రంశం కూడా తరచూ జరుగుతూ ఉంటుంది. కనుకనే 'బరల్‌గన్' ఎక్కడ ఉందో వెతకటం సప్త సముద్రాలని ఈదినంత పని అయింది శ్యామలకు. కడుపునొప్పి ఎక్కువయింది. తట్టుకోలేక మోకాళ్ళు ముడుచుకుని కడుపులో పెట్టుకుంది. మోకాళ్ళని బలంగా అదుముకోవడంతో, నొప్పి కొద్దిగా తగ్గినట్లు అన్పించింది. కానీ నిజంగా ఆ బాధ... మంచూ, నిప్పూ, రెండూ రంగరించి కడుపులో పోసినట్లుగా... జ్వలిస్తూ ఉంది. ఉప్పు సంతృప్త ద్రావణం గొంతులో నుండి జారి కడుపులో గడ్డకట్టి, మళ్ళీ కరుగుతున్నట్లుగా చెప్పలేని బాధ...శ్యామల బరల్‌గన్ కోసం వెతికి వెతికి మరి ఓపికలేక అలాగే పడుకుని పోయింది. గాయత్రి శరీరం అంతా ఒక కేంద్ర బిందువు దగ్గరకు చేర్చి... సున్నలా మార్చుకుని మెల్లగా నిద్రలోకి జారుకుంది. కనుకొలకుల చివర్ల నుండి కన్నీరుజారి ఆమె బుగ్గల మీద స్థిరపడిపోయి, ఎండిపోయి, చారికలుగా మిగిలిపోయింది.

గాయత్రి ఒళ్ళో బాధో... బాధ వళ్ళో గాయత్రో ఒదిగిపోయి రాత్రి కరిగిపోవడాన్ని మౌనంగా చూస్తో మిగిలిపోయారు.

రాత్రి ఎన్ని గంటలకు పడుకున్నా ఉదయమే నాలుగు, నాలుగున్నరకల్లా లేచే అలవాటు గాయత్రిది. అలవాటు ప్రకారం నాలుగున్నరకల్లా మెలకువ వచ్చింది. నిద్రలో కడుపునొప్పి మాయమయిపోయిందేమో... వాన వెలసిన ఆకాశంలా ప్రశాంతంగా ఉంది పొట్టంతా...! మొహంలోంచి బాధ జారిపోయి, కొత్త తేజస్సు వచ్చి చేరింది.

తలగడ కింద పెట్టుకున్న పుస్తకం తీసి చదవాలని ప్రయత్నం చేసింది. జీరోబల్బు వెలుగు అందుకు ఎంత మాత్రమూ సహకరించలేదు. పుస్తకం అలాగే పట్టుకుని ఆలోచనల్లోకి జారిపోయింది గాయత్రి.

సంధిగ్ధ రేఖ అంచున నిల్చిన కుటుంబం అది. అర్థడాక్సీ తన చిట్టచివరి చోటు కోసం వెతుక్కుంటుంటే ఆశ్రయం ఇచ్చిన కుటుంబం అది. ఇద్దరు ఆడపిల్లలు... ఒక చిన్న మగపిల్లాడు... భర్తను కోల్పోయి రెండో పెళ్ళి ఊసెత్తని మేనత్త... అమ్మా... నాన్నా... మొత్తం ఆరుగురు సభ్యులు.

విడి మంచం... విడి కంచం... అంతా వేరేనే... నెలనెలా సహజాతి సహజమయిన ఒక అవసరాన్ని... తప్పనిసరి కార్యాన్ని అంత అంటరానితనంతో ఎందుకు పోల్చుతారో ఆమెకు అర్థం కాదు. ఇంటికి ఎవరయినా వస్తే... అదంతా తెలిసిపోయేట్లుగా... బిహేవ్ చేస్తారు. ఎంత అసహ్యంగా ఉంటుందో ఎవరు ఊహించగలరు. దానికి తోడు కడుపును మండించే నొప్పి ఒకటి.

విడి జీవితం మానసికంగా కల్పించే హింస ముందు శారీరకంగా లభించే విశ్రాంతి ఎందుకూ కొరగాదు. చాలా చిన్న ఇంట్లో... ఆరుగురు సభ్యులు వుంటున్నపుడు ఒకరినొకరు తగలకుండానో, ఢీకొనకుండానో, ఉండటం పూర్తిగా అసాధ్యం. అలాంటప్పుడు ఆ మూడు రోజులూ... అందర్నుండీ దూరంగా... అపవిత్రంగా ఉండాలంటే మూలకు తోసివేసిన చెత్తకుప్పలాగా... ఉండాల్సిందే.

ఆలోచనల్లోనే బాగా పొద్దు ఎక్కింది. అయిదుగురూ నిద్ర నుండి లేచి ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయ్యారు. గుమ్మంలోకి పేపర్‌బాయ్ పేపరు విసిరితే దాన్ని చదువుతూ కూర్చుంది గాయత్రి. అప్పటికి ఎనిమిది గంటలవుతుందేమో...నిజానికి ఆ సరికల్లా... స్నానంచేసి ఫ్రెష్‌గా తయారయి... నందివర్ధనం పువ్వొకటి తలలో పెట్టుకుని కాలేజీకి తను బయల్దేరాలి. కానీ ఇవ్వాళ... ఈ మూడురోజులూ... కాలేజీకి డుమ్మా తప్పదు. ఉదయం ఎనిమిది గంటలకల్లా తండ్రి స్కూలుకి వెళ్ళిపోవాలి. శ్యామలా స్కూలుకి వెళ్ళాలి. మేనత్త స్టిచ్చింగ్ సెంటర్‌కి వెళ్ళాలి. ఇంట్లో ఒంటరిగా ఉండేది తల్లి ఒక్కత్తే. అందరికీ ఉదయంపూట అర్జంటుగా రెడీ అవ్వాల్సిన అవసరాలే కాబట్టి ఉదయంపూట ఆ యిల్లంతా... నిద్రలేచి ఒళ్ళు విర్చుకున్న రైల్వే ప్లాట్‌ఫారం చేసే హడావిడిలాగా ఉంటుంది.

చదివిన పేపర్నే మళ్ళీ చదివి పక్కన పడేసింది. మౌనంగా కూర్చుండిపోయింది గాయత్రి. స్కూలుకి వెళ్ళడానికి తయారయి బాక్స్ పట్టుకుని బయటకు వచ్చిన శ్యామల గాయత్రి వంక చూసి

'ఓ... నీకింకా నీళ్ళు ఇవ్వలేదు కదూ!' అని స్వగతంలో అనుకుని-

''అమ్మా నేను వెళుతున్నాను గానీ... దీనికేం కావాలో చూడు'' అంటూ బయటకు వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోతున్న శ్యామలను చూస్తే గాయత్రికి చెప్పలేని కోపం ముంచుకొచ్చింది.

''కాస్త పేస్టూ, బ్రష్షూ ఇచ్చి బాత్‌రూంలో కాసిని నీళ్ళు పెడితే, నా పనేదో నేను చేసుకుంటాను కదా!' అనుకుంది.

నాలుగున్నరకల్లా మొహం కడుక్కునే తను... ఎనిమిది అయినా అలాగే ఉండిపోవడంతో అసహనం పేరుకు పోసాగింది తనలో. ప్రతిసారీ... ఈ పీరియడ్స్ ఒక శాపం అయిపోయాయి. ఇంత స్నానంచేసి ఇంట్లోకి వస్తానంటే వినరు.

''గాయత్రీ... ఇదుగో పేస్టూ, బ్రష్షూ త్వరగా మొహం కడుక్కుని వస్తే... కాఫీ ఇస్తాను'' అంటూ లోపలి నుండి శారదమ్మ వచ్చింది.

''ఆరు గంటలకల్లా కాఫీ తాగకపోతే నేను మనిషిని కాదన్న విషయం నీకు తెలుసు. ఇప్పుడు ఎనిమిదిన్నర. ఇప్పటిదాకా ఇలా అనామకంగా పడి ఉండటం ఎంత నరకమో తెలుసా... నోరంతా ఛండాలంగా ఉంది. నా డ్రస్సు కూడా ఇవ్వు ఒక్కసారే స్నానం చేసి వస్తాను. పదేపదే మిమ్మల్ని ఎవరు బ్రతిమాలతారు? అస్సలు... దానికి బుద్ధి ఉందా? లేచీ లేవగానే నా సంగతి చూడొచ్చు కదా... నేను మామూలుగా ఉంటే ఎవరి మీద అయినా ఆధారపడుతున్నానా...'' కోపంతో విరుచుకు పడింది గాయత్రి తల్లి మీద.

గాయత్రి మాటలకు శారదమ్మకూ కోపం వచ్చింది. ''నీకసలు... ఈ మూడు రోజులూ... కోపం పెరిగిపోతుంది. నేను మాత్రం ఊరకే కూర్చున్నానా...? పొద్దున లేచిందగ్గర్నుండి చేస్తూనే ఉన్నానుగా'' అంది.

''సరేలే... ఆ పేస్టిలా పడెయ్యి'' అంది గాయత్రి.

శారదమ్మ పేస్టూ, బ్రష్షూ, డ్రస్సూ తెచ్చి ఇచ్చింది. ''బాత్‌రూంలో నీళ్ళు పెట్టాను. త్వరగా తెములుచుకుని రా!'' అంది. బాత్‌రూంలో చల్లటి నీళ్ళు ఒంటి మీద పడేసరికి పోయిన ప్రాణం లేచి వచ్చినట్లు అయింది. మగ్గిన మామిడిపండులాగా వాసన వేస్తున్న శరీరం మీద శాండల్‌సోప్ అద్దేసరికి ఆ వాసన బాత్‌రూం అంతా అలుముకుంది.

గాయత్రి స్నానంచేసి బయటకు వచ్చేసరికి తొమ్మిదిన్నర. లోపలంతా ఎలుకలు తోడేస్తూ వుండేసరికి ''అమ్మా కాఫీ...'' అంటూ అరిచింది.

''ఇదుగో'' అంటూ కాఫీ తీసుకుని వచ్చి కొంచెం ఎడంగా పెట్టింది శారదమ్మ.

ఈ సన్నివేశాన్ని ఏ దళిత రచయితో, దళిత కవో, పోనీ ఫెమినిస్టు రచయిత్రులో చూస్తే ఏమనుకుంటారో అనుకుంది గాయత్రి కాఫీ అందుకుంటూ. నిజంగా అంటరానితనం ఎక్కడుంది? దళి ల కంటే కూడా అంటరాని వస్తువుగా చూడబడే వస్తువు ఈ ప్రపంచంలో ఏదయినా ఉంటే అది కేవలం స్త్రీ మాత్రమే

కాఫీ గ్లాసు ప్రక్కన పెట్టుకుంటూ.

''అమ్మా... అద్దం... దువ్వెన'' అంది గాయత్రి.

''నీ అందింపులతో నేను చచ్చిపోతున్నానే. ఇదుగో పట్టు'' అంటూ అద్దం దువ్వెన తెచ్చి ఇచ్చింది శారదమ్మ.

''అలా చచ్చిపోయే బదులు... నన్ను ఇంట్లోకి రానిస్తే నా బాధేదో నేను పడతాను కదా! ఈ అంటరానితనం ఎందుకూ'' అంది గాయత్రి... ఒక్క క్షణం ఆగి... తనే...

''మారే కాలంతోపాటు మనమూ మారాలమ్మా! లేకపోతే వెనుకబడి పోతాం. ఇలా దూరంగా కూర్చోవటం ఇదంతా నీ కాలంలో సరిపోయిందేమో కానీ... ఇప్పుడస్సలు కుదరదు. అస్సలు మూడు రోజులు బయట ఉండాలని ఎందుకు సంప్రదాయం పెట్టారో తెలుసా?'' అంది గాయత్రి అద్దంలో మొహం చూసుకుంటూ నుదుటిన బొట్టుబిళ్ళ అందించుకుంటూ.

''ఎందుకో చెప్పు! నువ్వే'' అంది శారదమ్మ.

''పూర్వం స్త్రీ వంటింటి కుందేలులా ఉండేది. పనిచేసే బానిసలాగా ఉండేది. ఉదయం లేచిందగ్గర్నుండి రాత్రి పడుకోబోయే వరకూ క్షణంపాటు కూడా నడుంవాల్చే సమయం ఉండేది కాదు ఆమెకి. అలాంటి స్త్రీకి ఇంటి శ్రమ నుండి విశ్రాంతి ఇవ్వడం కోసం... సహజంగానే ఆ సమయంలో కాస్త నీరసంగా ఉంటుంది కాబట్టి, విశ్రాంతి ఇవ్వడం కోసం మూడు రోజులు బయట ఉండాలన్నారు. అంతేకానీ నువ్వు అనుకుంటున్నట్లు ఇంట్లో కలిస్తే పాపమూ లేదు. బయట వుంటే పుణ్యమూ లేదు. ఇప్పుడు వంటింట్లో శ్రమ కూడా... మిక్సీలు, ఫ్రిజుల రూపంలో సింప్లిఫై అయింది కాబట్టి బయట ఉండాల్సినంత అవసరమూ లేదు'' అంది గాయత్రి.

''ఆ చూస్తూనే ఉన్నానుగా... నాకు ఏ మాత్రం విశ్రాంతి దొరుకుతుందో... వంటింట్లో పడే శ్రమలో సాంద్రత తగ్గిందేమో కానీ అందుకు పదింతలు వత్తిడి పెరిగింది'' అంటూ లోపలకు వెళ్ళిపోయింది శారదమ్మ.

''నేను మాట్లాడింది శ్రమ... విశ్రాంతి గురించి కాదు బయట వుండటం వెనుక వున్న గొడవ. అయినా వంటింట్లో స్త్రీ పడుతున్న శ్రమకి ఖరీదు కట్టే షరాబు ఎవడూ లేడన్న విషయం నాకూ తెలుసు'' అంది గాయత్రి.

''గొప్పగా మాటలు నేర్చావులే'' అంది శారదమ్మ.

''నిజం ఎప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుందిలే...'' అంది గాయత్రి.

మధ్యాహ్నం పేపర్‌లో దూరదర్శన్ కాలమ్ చూసూ ఎగిరి గంతేసింది గాయత్రి. టైము చూస్తే రెండు కావడానికి ఖచ్చితంగా రెండంటే రెండే రెండు నిమిషాలుంది.

''అమ్మా... అమ్మా'' అంటూ పిల్చింది గాయత్రి.

''ఎందుకు అట్లా అరుస్తావు?'' అంటూ వచ్చింది శారదమ్మ.

''ఎందుకేమిటి? ఇప్పుడు టి.వి.లో నాకు ఇష్టమయిన రాక్షసుడు సినిమా వస్తుంది. నా ఫేవరైట్ రైటర్ యండమూరి నవల అది'' అంది గాయత్రి.

''అయితే ఏం చెయ్యమంటావు?''

''ఏం చెయ్యటమేంటి? ఈ డోరు కర్టెను తీసి అవతల పారేసి ఇ.టి.వి. పెట్టు. కమాన్ క్విక్'' అంది గాయత్రి.

''దార్లో కూర్చుని సినిమా చూస్తే ఎలా?''

''మరయితే టి.వి. తీసి ముందు గదిలో పెట్టు''

''ఇంకాసేపట్లో మీ నాన్న వస్తారు. టి.వి. ముందు గదిలో ఉంటే ఆయనతో తంటా...'' అంది శారదమ్మ.

''నీ ఆర్గ్యుమెంట్‌తో చంపేస్తున్నావే. అర్జంటుగా టి.వి. పెట్టు. టైటిల్స్ దగ్గర్నుండీ సినిమా చూడకపోతే నాకు సినిమా చూసినట్టుండదు'' అంది గాయత్రి.

''నీతో గొడవ ఎవరు పడతారు?'' అంటూ డోర్ కర్టెన్ తీసి అవతల పడేసి .టి.వి. పెట్టింది శారదమ్మ.

మధ్య గదికి, ముందు గదికి మధ్య కుర్చీ వేసుకుని సినిమాలో నిమగ్నమయింది గాయత్రి. పది పదిహేను నిమిషాలు అయిందో లేదో... ''అమ్మా... అమ్మా'' అంటూ వచ్చిన రవి దారిలో వున్న గాయత్రిని చూడక... గాయత్రి మీద వాలిపోయాడు.

''దూరం... దూరం'' అంటూ గాయత్రి కుర్చీలోంచి లేవడమూ... రవి మీద పడిపోవడమూ ఒకేసారి జరిగాయి. వీడితో ప్రతిసారి ఇదే గొడవ. వీడి బట్టలన్నీ ఉతకలేక నేను చస్తున్నాను'' అంది గాయత్రి కోపంగా.

''చూసుకోలేదక్కా...'' అంటూ అమాయకంగా మొహంపెట్టాడు రవి.

వాడి అమాయకపు మొహం చూసేసరికి గాయత్రికి నవ్వొచ్చింది.

''సరేలే ముందా బట్టలు విడువు'' అంది.

వాడు నిమిషంలో షర్టూ, నిక్కరు విప్పేసి గాయత్రి మొహం మీదకు విసిరేసి బాత్‌రూంలోకి తుర్రుమన్నాడు. పురుషుడికి బుద్ధులు పుట్టుకతోనే వస్తాయేమో 'వీడెలా విసిరి కొట్టాడో?' అనుకుంది గాయత్రి. మళ్ళీ కుర్చీ సరిగా వేసుకుని కూర్చోవడమూ, కరెంట్ పోవడమూ ఒకేసారి జరిగాయి. టి.వి. తెరమీది చిరంజీవి నోరు తెరిచింది తెరిచినట్లుగానే మాయమయిపోయింది.

'షిట్!' అనుకుంటూ కుర్చీతీసి పక్కన పడేసింది గాయత్రి.

సాయంత్రం ఎప్పుడో ఎనిమిది గంటలకు తండ్రి వచ్చాడు. అప్పటికి శ్యామల భోజనం పూర్తి చేసింది. గాయత్రి విస్తట్లో భోజనం చేస్తూ ఉంది.

తండ్రి కాళ్ళు కడుక్కుని లోపలకు వస్తూ ''ఇంకా ఎన్ని రోజులు?'' అన్నాడు గాయత్రిని ఉద్దేశించి.

''ఇంకా నలభై రోజులు'' అంది గాయత్రి కోపంగా. ఈ మూడు రోజుల విషయంలో తండ్రంటేనే ఎక్కువ కోపం గాయత్రికి. తన ఆర్గ్యుమెంట్‌లో కొద్దో, గొప్పో తల్లిని ఒప్పించి కనీసం మూడో రోజైనా ఇంట్లోకి రావచ్చు. తండ్రి ఉంటే మాత్రం యథావిధిగా మూడు రోజులు వుండాల్సిందే. తండ్రి అంటే తనకు గౌరవం వున్నప్పటికీ ఈ విషయంలో తండ్రంటే గౌరవం కదా కదా అసహ్యమే ఎక్కువ. ఆడపిల్లల సమస్యలు ఆడపిల్లలవి. వాళ్ళ వ్యక్తిగత జీవితంలోకి తను తొంగి చూడటం ఎందుకు? అదేం అంటే 'గుడ్డొచ్చి పిల్లను వెక్కిరిస్తుందా?' అంటూ తండ్రిని అనే అహంకారం అభిజాత్యం ప్రదర్శిస్తాడు. తండ్రి పిల్లల నుండి ప్రేమనూ, గౌరవాన్నీ పొందాలి తప్పిస్తే... అసహ్యాన్ని...

''ఇంకా నలభై రోజులు'' అంటూ గాయత్రి వ్యంగ్యంగా అనగానే తండ్రికీ కోపం ముంచుకొచ్చింది.

''మూడురోజులు హాయిగా తిని కూర్చోక... ఏం రోగం వచ్చింది నలభై రోజులు అంటూ వ్యంగ్యం ఒకటి?'' అన్నాడు అతడు.

''అంటరానిదాన్నిగా చూస్తుంటే ఆహా ఏం హాయి అనుభవిస్తాం... ఏం హాయి?'' అంది గాయత్రి మరింత ఉక్రోషంగా.

తండ్రి ఏం మాట్లాడలేదు.

మరో రెండు నిమిషాల తర్వాత తనే...

''అసలెందుకు నాన్నా! ఈ మూడు రోజుల నరకం మాకు. స్నానంచేసి ఇంట్లోకి వస్తే ఏం కొంపలు అంటుకుంటాయి. మనింట్లోనే ఇదొక పెద్ద ప్రహసనం. పదిమందికి తెలిసి ఎంత అసహ్యంగా ఉంటుంది. మా ఫ్రెండ్సందరికీ వాళ్ళ డేట్ ఎప్పుడో వాళ్ళకే తెలీదు. మనింట్లో మాత్రం ఆఖరికి రవిగాడికి కూడా లోకువే! మా ప్రాబ్లమ్స్ మీకెలా తెలుస్తాయి'' అంది గాయత్రి.

''నువ్వు ఎన్నయినా చెప్పు అమ్మాయి. ఆచారం సంప్రదాయం అంటూ ఒకటి వున్నాక వాటిని మనం అనుసరించక తప్పదు'' అన్నాడు.

''ఆచారాలు, సంప్రదాయాలు మంచివి అయితే ఫర్వాలేదు. స్త్రీలను అవమానపర్చే ఆచారాలు, సాంప్రదాయాలు ఏం ఆచారాలు సంప్రదాయాలు... నన్ను ముట్టుకుంటే రవిగాడో, నువ్వో స్నానం చేయాలా... ఈ మూడు రోజులూ నేను అంత అంటరానిదాన్ని అవుతానా?'' అంది గాయత్రి ఆవేశంగా.

''నువ్వొక్కదానివే ఆచారం, సంప్రదాయం పాటిస్తున్నట్లు మాట్లాడుతావేం? లోకం అంతా పాటించట్లేదా?'' అన్నాడు అతను.

''అందరి సంగతి నాకెందుకు? అయినా నూటికి డెబ్బై అయిదు మంది దీన్ని ఎప్పుడో మానేసారు'' అంది గాయత్రి.

''ఇతర కులాలకు, మనకూ ఏంటి పోలిక?'' అంది శారదమ్మ.

''పీరియడ్స్ ఎవరికైనా ఒకటే కదా...'' అంది గాయత్రి.

''సంప్రదాయం వదిలేసిన వాళ్ళంతా వాటికోసం మళ్ళీ పాకులాడుతూ వెనక్కు వస్తుంటే నువ్వు వున్న సంప్రదాయం వదిలేస్తాను అంటావేమిటి?'' అన్నాడు తండ్రి. శ్రావణ మంగళవారాల నోములు ఎంతో ఇదీ అంతే! ఆడవాళ్ళంతా వాటిని వదిలేస్తున్నారా? దీన్ని వదిలెయ్యడానికి'' అంది శారదమ్మ. వాదన అంతా వింటూ కూర్చుంది శ్యామల.

''అయినా దానికీ, దీనికీ పోలికేంటి?'' అన్నది గాయత్రి విస్తరి మడుచుకుంటూ!

''ఏదో ఒక రోజు డేట్ చెప్పకుండా నేను ఇంట్లో కలిపెయ్యకపోతే చూడు'' అంది గాయత్రి ఉక్రోషంగా. తను ఈ మూడు రోజులు కాలేజీకి వెళ్ళకపోతే ఖచ్చితంగా ఇదే అని అందరికీ తెలిసిపోతుంది. తనదసలే కోఎడ్యుకేషన్ కాలేజి. మగపిల్లలందరికీ ఇది అరటిపండు వలచినట్లు అర్థమౌతుంది.

''ఇవ్వాల్టి నుండి పద్దెనిమిదో రోజు అంటే ఏ తారీకురా!'' అంటూ వాళ్ళు ఎంత ఛండాలంగా మాట్లాడుకుంటారో...'' తనని చూపిస్తూ. అదంతా గుర్తుకొచ్చేసరికి గాయత్రి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ''ఏంటి? ఏదో ఒకరోజు ఇంట్లో కలిపేస్తావా? ఆ మర్నాడు ఈ ఇంట్లో నుండి శవం లేస్తుంది'' అన్నాడు తండ్రి అంత ఆవేశంగానూ.

ఒక్క క్షణంపాటు నిశ్శబ్దం ఆవరించుకుంది గది అంతా. గాయత్రి అటు తిరిగి పడుకుంది. ఏడుపును గుండెల్లోనే అదిమి పట్టుకుంటూ.

★